## కల్వర్టు పునర్నిర్మాణానికి నిధులు మంజూరు

జిన్నారం, అక్టోబర్ 5: జిన్నారం-జంగంపేట గ్రామాల మధ్య ఉన్న కల్వర్టును పునర్నిర్మించేందుకు రూ. 23లక్షల నిధులు మంజూరైనట్లు సర్పంచ్ వెంకటయ్య, ఎంపీటీసీ వెంకటేశంగౌడ్ గురువారం తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా జిన్నారం-జంగంపేట గ్రామాల మధ్య ఉన్న కల్వర్టు పూర్తిగా దెబ్బతిన్న విషయం తెలిసిందే. ఈ విషయాన్ని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా స్పందించి ఆర్ అండ్‌బీ ద్వారా రూ. 23లక్షల నిధులు మంజూరు చేయించారని చెప్పారు. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

## కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్ ఆవిష్కరణ

గుమ్మడిదల, అక్టోబర్ 5 : శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సావాల వాల్‌పోస్టర్, ఆహ్వాన పత్రికలను ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. గుమ్మడిదలలో కల్యాణ వేంకటేశ్వర స్వామిబ్రహ్మోత్సవాలకు ఈ నెల 15వ తేదీన అంకురార్పన జరుగనుంది. ఈ సందర్భంగా గురువారం ఆలయకమిటీ అధ్యక్షుడు పడమటి లక్ష్మారెడ్డి, జడ్పీటీసీ కుమార్‌గౌడ్, సర్పంచ్ నర్సింహారెడ్డి, ఆలయ వంశపార్యపరంకులు కేవీ. నర్సింహచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మద్దుల బాల్‌రెడ్డి, కాలకంటి రవీందర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, పుట్ట నర్సింగ్‌రావు, రౌతు నరేశ్, దేవేందర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, పవన్‌కుమార్, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ తుది ఓటర్ల జాబితా విడుదల

బొల్లారం, అక్టోబర్ 5 : రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బొల్లారం మున్సిపాలిటీలోని తుది ఓటరు జాబితాను మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా బీఎల్వోలతో కలిసి మున్సిపల్‌లోని 32 పోలింగ్ స్టేషన్ల తుది ఓటరు పబ్లికేషన్ జాబితాను ఆయన కార్యాలయ ఆవరణలో విడుదల చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నేటి నుంచి అన్ని పోలింగ్ స్టేషన్లలో సంబంధిత బీఎల్వోలు ప్రకటించిన తుది ఓటరు జాబితాను రాజకీయ, ప్రజాప్రతినిధులు, ఓటర్లకు పరిశీలన నిమిత్తం అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్వో శ్రీధర్, మేనేజర్లు నిర్మల, మల్లికార్జున్, బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.



బీఎల్వోలతో కలిసి తుది ఓటరు జాబితాను విడుదల చేస్తున్న కమిషనర్ సంగారెడ్డి

## మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

కంది, అక్టోబర్ 5: మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదని ఎంపీటీసీ నందకిషోర్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉచిత చేప పిల్లల పంపిణీలో భాగంగా గురువారం కంది దేవుని చెరువు, కిసాన్ చెరువులో లక్షా 62వేల చేప పిల్లలను మత్స్యకార సంఘు నాయకులతో కలిసి వదిలారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు ప్రాధాన్యతనిస్తూ బాసటగా నిలుస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమన్నారు. ఉచిత చేప పిల్లలతో పాటు సబ్సిడీపై వలలు, వాహనాలు అందజేస్తూ అండగా నిలుస్తుందన్నారు. చెరువులన్నీ నీటితో నిండుకుండలా దర్శనమిస్తూ, పైసా ఖర్చు లేకుండా చేప పిల్లలు ప్రభుత్వం ఇస్తుండటంతో మత్స్యకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు మన్నె అశోక్, కార్యదర్శి వీరన్న, బీఆర్ఎస్ నాయకులు లక్ష్మణ్‌గౌడ్, మొగులయ్య, చోటేమియా పాల్గొన్నారు.



కంది చెరువులో చేప పిల్లలను వదులుతున్న మత్స్యకారులు, బీఆర్ఎస్ నాయకులు

# సీఎం కేసీఆర్ ఆశీస్సులతో అద్భుత ప్రగతి

## తొమ్మిదేండ్లలో పటాన్‌చెరు రూపురేఖలు మార్చాం

- ఓటు అడిగే అర్హత బీఆర్ఎస్‌కే ఉంది
- ప్రతి పక్షాలకు ప్రజలే బుద్ధి చెబుతారు
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, అక్టోబర్ 5 : తొమ్మిదేండ్లలో పటాన్‌చెరు నియోజకవర్గం రూపురేఖలు మార్చామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. గురువారం పటాన్‌చెరు మండలం ముత్తంగి, ఐనోల్, ఇస్నాపూర్ గ్రామాల్లో పలు అభివృద్ధి పనలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ముత్తంగి గ్రామంలో రూ. 3.28కోట్లు, ఐనోల్ గ్రామంలో రూ. 2.55కోట్ల అంచనాతో పలు అభివృద్ధి పనులకు, ఇస్నాపూర్‌లో జీవీఆర్ ఎంటర్‌ప్రైజెస్ సౌజన్యంతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను పలు గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తొమ్మిదేండ్ల బీఆర్ఎస్ పాలనలో పటాన్‌చెరు నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణలోని అన్ని గ్రామాలకు, మున్సిపాలిటీలకు భారీగా నిధులు మంజురయ్యాయన్నారు. సీఎం ఆశీస్సులతో గ్రామాల్లో తొమ్మిదేండ్ల కాలంలో నూతన పంచాయతీ భవనాలు, పల్లెప్రకృతివనాలు, డంప్‌యార్డులు, రైతువేదికలు, నర్సరీలు, పార్కులు, వాకింగ్‌ట్రాక్‌లు, వైకుంఠధామాలతో పాటు అన్ని గ్రామాలకు అద్భుతమైన రోడ్లు వచ్చాయన్నారు.

**మిషన్ భగీరథతో తాగునీరు అందించాం**

మిషన్ భగీరథతో ప్రతి గడపకు తాగునీరందించడంతో పాటు మహిళలకు రుణాలిచ్చి ప్రోత్సహించామన్నారు. ట్రాక్టర్లు పెట్టి పారిశుధ్య సమస్యలు లేకుండా చూస్తున్నామన్నారు. పలు గ్రామాల్లో కమ్యూనిటీ హాల్స్‌ను సైతం నిర్మించామని తెలిపారు. అమలు సాధ్యం కాని వాగ్దానాలతో కాంగ్రెస్, బీజేపీలు ప్రజలను మభ్యపెడుతున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, ఎంపీపీ సుష్మాశ్రీవేణుగోపాల్‌రెడ్డి, జడ్పీటీసీ సుప్రజావెంకట్‌రెడ్డి, సర్పంచ్‌లు ఉపేందర్‌ముదిరాజ్, పద్మ, వెంకటేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాండు, మాజీ సర్పంచ్ శంకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు దశరథరెడ్డి, వెంకట్‌రెడ్డి, పంచాయతీరాజ్ డీఈ సురేశ్, ఎంపీడీవో బన్సీలాల్, మాజీ ఎంపీపీ శ్రీశైలంయాదవ్, మాజీ ఎంపీటీసీ గడ్డయాదయ్య, మెరాజ్‌ఖాన్, రామకృష్ణముదిరాజ్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**ప్రణాళికాబద్ధంగా కాలనీల అభివృద్ధి**

అమీన్‌పూర్, అక్టోబర్ 5: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. అమీన్‌పూర్ మున్సిపల్‌లోని వివిధ కాలనీల్లో రూ. 2.40కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు బుధవారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో ఇప్పటి వరకు రూ. 70కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. గతంలో పంచాయతీగా ఉన్న సమయంలో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే వారని, నేడు మున్సిపల్‌లో మూడు భారీ రిజర్వాయర్లు నిర్మించి ప్రతి ఇంటికి రక్షిత తాగునీరు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నందారం నర్సింహగౌడ్, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




పటాన్‌చెరు : ముత్తంగిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి




అమీన్‌పూర్ : అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

# క్రీడాకారులకు అండగా నిలుస్తున్నాం

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, అక్టోబర్ 5 : క్రీడాకారులకు అండగా నిలుస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. గురువారం పటాన్‌చెరు పట్టణంలోని జీఎమ్మార్ కన్వెన్షన్ హాల్‌లో క్రీడాకారులకు స్పోర్ట్స్‌కిట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో క్రీడాప్రాంగణాలు నిర్మించామన్నారు. క్రీడాకారులు గ్రామాల్లో నచ్చిన ఆటలు ఆడేందుకు అవకాశం కల్పించామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ క్రీడారంగానికి ఇచ్చిన ప్రోత్సాహంతో తెలంగాణ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదుగుతున్నారన్నారు. గ్రామీణ, మండల స్థాయిలో క్రీడాప్రాంగణాలు, మినీ స్టేడియాలను అందుబాటులోకి తేవడంతో క్రీడాకారులకు అవకాశం లభించిందన్నారు. ప్రభుత్వం ద్వారా అందజేస్తున్న ఈ స్పోర్ట్స్ కిట్‌లను వాడుకొని క్రీడల్లో రాణించాలని కోరారు. నియోజకవర్గంలో ఐదు మినీ స్టేడియాలను నిర్మిస్తున్నామన్నారు. పట్టణంలోని మైత్రి స్టేడియం కూడా క్రీడాకారులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థి దశనుంచే క్రీడల్లో ప్రవేశించాలని ఎమ్మెల్యే కోరారు. ఎవరైనా వ్యక్తిగత క్రీడా ప్రతిభను చాటితే తప్పకుండా ప్రోత్సహిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, జడ్పీటీసీ సుప్రజావెంకట్‌రెడ్డి, కుమార్‌గౌడ్, ఎంపీపీ సుష్మాశ్రీవేణుగోపాల్‌రెడ్డి, కార్పొరేటర్ పుష్పానగేశ్, మార్కెట్ కమాటీ చైర్మన్ విజయ్‌కుమార్, సర్పంచ్‌లు ఉపేందర్‌ముదిరాజ్, గడ్డం బాలామణి, ఎంపీటీసీ నాగజ్యోతి, నాయకులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు కిట్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

## విద్యార్థులకు హెటిరో పరిశ్రమ చేయూత

జిన్నారం, అక్టోబర్ 5 : జిన్నారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల చదువుకు హెటిరో పరిశ్రమ చేయూతనిచ్చింది. గురువారం పాఠశాల ఆవరణలో హెటిరో పరిశ్రమ హెచ్‌ఆర్ భాస్కర్, హెచ్‌ఎం మృదుల, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి బీఆర్ఎస్ జిల్లా నాయకుడు వెంకటేశంగౌడ్ విద్యార్థులకు నోటుపుస్తకాలు, బ్యాగులు, యూనిఫామ్స్ అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశంగౌడ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం హెటిరో పరిశ్రమ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు చదువుకు అవసరమైన సామగ్రి, యూనిఫామ్స్ అందజేస్తుండటం అభినందనీయమన్నారు.

ఈ సందర్భంగా పరిశ్రమ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు ఏర్పుల లింగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అండర్ 17 క్రికెట్ పోటీలకు ముగ్గురు ఎంపిక

సంగారెడ్డి, అక్టోబర్ 5 : స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే అండర్ 17రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో సంగారెడ్డి జిల్లాకు చెందిన ముగ్గురు క్రికెట్ క్రీడాకారులు ఎంపికయ్యారు. సిద్దిపేటలో జరిగిన క్రీడాకారుల ఎంపిక కార్యక్రమంలో సంగారెడ్డికి చెందిన నెవిన్ మానిత్, రిత్విక్‌రెడ్డి, సఫాన్ ఎంపికయ్యారు. వీరు ముగ్గురు ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ జట్టు తరపున త్వరలో హైదరాబాద్‌లో జరగబోయే రాష్ట్రస్థాయి అండర్ 17క్రికెట్ క్రీడా పోటీల్లో పాల్గొననున్నారు. సంగారెడ్డిలోనే శిక్షణ పొందుతున్న నెవిన్ మానిత్ పలు క్రీడా పోటీల్లో ప్రతిభను కనబర్చి మెడల్స్ సొంతం చేసుకున్నారు.



రాష్ట్రస్థాయికి ఎంపికైన నెవిన్ మానిత్

## పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు అభినందనీయం

బొల్లారం, అక్టోబర్ 5 : పేద ప్రజలకు కార్పొరేట్‌స్థాయిలో వైద్య సేవలు స్వచ్ఛందంగా అందించడం అభినందనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ కొలన్ రోజాబాల్‌రెడ్డి అన్నారు. గురువారం బీరప్పబస్తీలో మెడిసిటీ దవాఖాన ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయగా మున్సిపల్ చైర్‌పర్సన్ రోజాబాల్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. శిబిరంలో పాల్గొన్న రోగులకు బీపీ, షుగర్, కంటి, చెవి, కణతులు, థైరాయిడ్, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, చర్మవ్యాధులు, ఊపిరితిత్తుల వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ స్వచ్ఛందంగా పేదలకు కార్పొరేట్ తరహాలో వైద్య సేవలను ఒకేచోట అందించేందుకు ముందుకు వచ్చిన మెడిసిటీ వైద్యులను అభినందించారు. శిబిరంలో 200 మందికి బీపీ, షుగర్ పరీక్షలు, 50మందికి ఆపరేషన్ నిమిత్తం రేఫర్ చేసినట్లు నిర్వహకులు తెలిపారు. నిర్వాహకులు చైర్‌పర్సన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్ ప్రభు నాయక్, మాజీ వార్డు సభ్యురాలు శారద, వైద్యులు రాకేశ్, సృష్టి, స్నేహా, అఖిల, శిరీష, మార్కెటింగ్ ఇన్‌చార్జి కుమారస్వామి, సత్యనారాయణ, సిబ్బంది రోగులు పాల్గొన్నారు.



రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ రోజాబాల్‌రెడ్డి